## క్లుప్తంగా

### వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకం

పెదపూడి: వేంద్రలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పాల్గుణ బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి తులసి, అమ్మవారికి కుంకుమ పూజలు, తర్పణం హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సత్యకృష్ణమాచార్యులు, వేదపండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### రెడ్ క్రాస్ సేవలపై అవగాహన పెంచుదాం



రెడ్‌క్రాస్ అధికారులతో సమావేశమైన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా చేపట్టే సేవలపై ప్రజలకు అవగాహన పెంచే కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేయవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. రెడ్‌క్రాస్ అధికారులు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి, రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ జి.మహాలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ పి.రాంబాబు మంగళవారం యూనివర్సిటీకి వచ్చిన వీసీతో కొద్దిసేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కార్యకలాపాలపై వారు చర్చించారు.

### వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కొంకుదురులో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

బిక్కవోలు: కొంకుదురులోని మంచినీటి చెరువు వద్ద గల మోక్ష వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శంకర్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సత్తి నాగిరెడ్డి, సుశీల దంపతులు మంగళ సూత్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. సత్తి శేఖర్‌రెడ్డి, అనూష దంపతులు కల్యాణ కర్తలుగా వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అదే ప్రాంగణంలో నిర్మించిన కనకదుర్గాదేవి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

### కుమార సుబ్రహ్మణేశ్వర స్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణేశ్వరుని ఆలయంలో మంగళవారం పాల్గుణ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అశేష సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారికి నిర్వహించిన అభిషేక, పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

### రహదారుల అభివృద్ధికి శంకుస్థాపన



పైన గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పెదపూడి: నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారుల నిర్మాణమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలో పైన, కుమారప్రియం, కాంగ్రేడుల తదితర గ్రామాల్లో సుమారు రూ.3 కోట్లతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు.ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, ఎన్డీఏ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు జుత్తక సూర్యకుమారి, పైన, కాంగ్రేగుల, కుమారప్రియం సర్పంచులు సుందరపిల్లి ప్రమీళ, కేవీవీ సత్యనారాయణ, బీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

# వేసవి కాలం.. పశువులు జర భద్రం

- పశువులకు పొంచి ఉన్న వడదెబ్బ ముప్పు
- నిర్లక్ష్యం చేస్తే మృత్యువాత పడే అవకాశం
- సకాలంలో రక్షణ చర్యలతో పశు సంరక్షణ సాధ్యం



ఏపీత్రయంలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సాయికృష్ణ



పశువుల మకాం వద్ద చెట్ల వద్ద ఉన్న గేదెలు

పెదపూడి: వేసవిలో మూగజీవాల పట్ల నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో మనుషులతోపాటు పశువులకు కూడా వడ దెబ్బతగిలే అవకాశాలున్నాయి. ఈ ప్రభావంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గడమే కాకుండా, ప్రాణాపాయ పరిస్థితులను మూగజీవాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథాలామస్ అనే భాగం స్వేద గ్రంధులపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో చెమట ద్వారా శరీరంలోని ధాతువులను కోల్పోయి పశువు శరీర ప్రక్రియలు మందగిస్తాయి. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. దీంతో పశువులు అపస్మారకస్థితిలోకి వెళ్లి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుంటే పశువులను రక్షించుకోవచ్చు.

**జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే**

వడదెబ్బ తగిలిన ఆవుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్ మించుతుంది. చర్మ మృదుత్వం తగ్గిపోయి గట్టిపడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారటం జరుగుతుంది. ఆవుల్లో పాలదిగుబడి, పునరుత్పత్తి, చూడుకట్టే శాతం తగ్గి గర్భస్రావం అయ్యే అవకాశం పెరుగుతుంది. ఎద్దుల్లో వంధత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువ అయినప్పుడు పక్షవాత లక్షణాలు సంభవించి క్రమంగా కోమాలోకి వెళ్లి మృత్యువాత పడతాయి.

**అనపర్తి నియోజకవర్గంలో పశు సంపద**

| | |
|---|---|
| ఆవులు | 12,242 |
| గేదెలు | 35,932 |
| గొర్రెలు | 15,221 |
| మేకలు | 5,993 |

**చికిత్స విధానం**

వడదెబ్బకు గురైన మూగ జీవాలను వెంటనే నీడ ప్రాంతానికి చేర్చాలి. అవకాశం ఉంటే ఫ్యాన్లు, కూలర్ల ద్వారా చల్లని గాలి అందించాలి. బాగా ఎండగా ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితో శుభ్రం చేయాలి. చల్లని నీరు తాగటానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నివారణ మందులను వాడాలి. వైద్యుల పర్యవేక్షణలో పశువుల రక్తంలోకి లవణ ద్రావణాలు ఎక్కించాలి.

**నివారణ చర్యలు**

వేసవిలో పశువులను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మేతకు బయటకు తీసుకెళ్లకూడదు. చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలి. రోజుకి 4–5 సార్లు చల్లని నీటితో కడగడంలేదా చెరువులు, కుంటలు ఉన్నచోట నీళ్లలోకి వదిలిపెట్టాలి.పశువుల కొట్టాలను ఎత్తుగా నిర్మించుకుని పైన ఎండిన గడ్డితో కప్పి, నీళ్లు చల్లుతూ ఉండాలి. పశువుల పాకల్లో వడగాలి వస్తున్న దిక్కుల్లో గోనె సంచులు కట్టి నీళ్లు చల్లుతుండాలి. నీటిశాతం ఎక్కువగా ఉన్న పచ్చిగడ్డి, పాతర గడ్డి, హైడ్రోఫోనిక్స్ గడ్డి పెట్టాలి. ఎక్కువగా దాణా, ఉడికించిన ధాన్యాలు పెడుతున్నప్పుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండ ధాటికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యలు నివారించవచ్చు.

**వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**



వేసవిలో మూగజీవాలు వడదెబ్బబారిన పడే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బ తగిలితే తక్షణమే చల్లని ప్రదేశానికి వాటిని తరలించాలి. వడదెబ్బ తగిలిన పశువులకు మెరుగైన ఉచిత వైద్యం అందిస్తాం. మధ్యాహ్నం సమయాల్లో మూగజీవాలను బయటకు విడిచిపెట్టవద్దు. రోజుకి ఐదుసార్లు మూగజీవాలను శుభ్రం చేయడం మంచిది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే మూగజీవాలు వడదెబ్బ బారీన పడకుండా కాపాడుకోవచ్చు. దీనిపై పాడి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– సాయికృష్ణ, పెదపూడి మండల పశువైద్యాధికారి

## శ్రీరామ భజన సప్తాహం విజయవంతం



భజన సప్తాహ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

రంగంపేట: వడిశలేరులో కొలువైయున్న శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 19న ప్రారంభమైన 25వ శ్రీరామ భజన సప్తాహ మహోత్సవాలు బుధవారం నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంతో ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామంలోని 17 భజన సమాజాలతో పాటు ఇతర గ్రామాల భజన సమాజాలు కూడా పాల్గొని శ్రీరామ సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్టు ఆయల కమిటీ చైర్మన్ మలిరెడ్డి శ్రీనివాస్, కార్యనిర్వాహణాధికారి ఎం.రాంబాబురెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన, భక్తి భావాన్ని పెంచాలనే ఉద్దేశ్యంతో 25 ఏళ్లుగా సప్తాహ భజనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సప్తాహ మహోత్సవాల్లో నిత్య పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. బుధవారం నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లిన నాగేశ్వరరావు, ఉప్పలపాటి సత్తిబాబు, నడిపల్లి ఆనందరావు, బిద్దే వరప్రసాద్ పాల్గొన్నారు.

## బలభద్రపురంలో సీపీఎం బృందం పర్యటన



బలభద్రపురం సర్పంచ్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

బిక్కవోలు: బలభద్రపురంలో సీపీఎం బృందం పర్యటించింది. గ్రామంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మంగళవారం సీపీఎం నాయకులు, భద్రాచలం మాజీ ఎంపీ మిరియం బాబూరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి ఉమామహేశ్వరరావు సందర్శించారు. ముందుగా గ్రాసిం కంపెనీకి వెళ్లి అక్కడి హెచ్‌ఆర్‌తో మాట్లాడారు. అక్కడ నుంచి వైద్య శిబిరానికి వచ్చి వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రజారోగ్యంపై సమగ్ర విచారణ నిర్వహించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వంపై ఉందన్నారు. క్యాంపు వివరాలను సర్పంచి బుంగా రామారావు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యను బలోపేతం చేసేందుకు ప్రారంభించిన శిక్షణ తరగతులను అంగన్‌వాడీ వర్కర్లు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సంపర, పెదపూడి సెక్టార్ల సూపర్‌వైజర్లు శ్రీ గౌరీ, శ్రీపద్మ అన్నారు. పెద్దాడలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పడాయిబీపై మూడు రోజులపాటు నిర్వహించే రెండో దఫా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో బ్యాచ్‌కు 40 మంది చొప్పున అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రామేశ్వరంలో ఇటీవల మొదటి దఫా శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం, విద్య రెండు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు.

## నైపుణ్యాభివృద్ధితో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: క్లాస్ రూమ్‌లో నేర్చుకున్న విజ్ఞానంతోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ విద్యార్థులకు సూచించారు. యూనివర్సిటీలో కొంతకాలంగా మూతపడి ఉన్న స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌ని మంగళవారం ఆమె పునఃప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. నైపుణ్యాలుంటేనే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి. జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ పి. సురేష్‌వర్మ, ఎఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

## మిర్తిపాడులో రీ సర్వే గ్రామసభ



మిర్తిపాడులో రీసర్వే గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

సీతానగరం: మిర్తిపాడులో రీ సర్వే గ్రామ సభ తహసీల్దార్ ఎ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం మిర్తిపాడు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో తహసీల్దార్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ జనవరి 20 నుంచి భూముల రీ సర్వే ప్రక్రియను రైతుల సమక్షంలో గ్రామ సర్వేయర్ సర్వే పూర్తి చేశారని తెలిపారు. రీ సర్వే అనంతరం భూముల కొలతలను నిర్ధారించామని, అందులో భాగంగా గ్రామసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. భూమి కొలతల వివరాలను ఆయా భూ యజమానులకు నోటీసుల ద్వారా తెలియజేయడానికి గ్రామసభ నిర్వహించామన్నారు. తమ భూమిలో ఏమైనా తేడాలుంటే అభ్యంతరం తెలియజేయవచ్చన్నారు. దీంతో అభ్యంతరం తెలిపిన రైతుల భూములు తిరిగి సర్వే చేస్తామని తెలిపారు. గ్రామ సభలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎమ్ భారతి, రీ సర్వే డీటీ మూర్తి, ఆర్ఐ రవీంద్ర, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

రాజానగరం: పాల్గుణ బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం స్థానిక పురాతన శివాలయంలో మంగళవారం రాజారాజేశ్వరీ సమేత రాజలింగేశ్వరస్వామి, రుక్మిణీ, సత్యభామల సమేత రాజగోపాలస్వామి వార్లకు కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### నేత్రపర్వంగా శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం



శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న రుత్విక్కులు

పెదపూడి: నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న పెదపూడి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి కల్యాణం నేత్రపర్వంగా మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆలయ అర్చకుడు కె.వెంకట్రావు ఆధ్వర్యంలో రుత్విక్కులు కల్యాణ క్రతువు నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించి భక్తిపరవశమయ్యారు.

# నాటుసారాను నిర్మూలిద్దాం



మల్లవరంలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్

మధురపూడి: నాటుసారాను నిర్మూలిద్దాం–ఆరోగ్యాలను పరిరక్షించుకుందామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం గోకవరం మండంలో మల్లవరంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణార్థం అన్ని ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం మల్లవరంలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన ప్రజాప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినీషా, కోరుకొండ సీఐ శ్రీనివాస బాలాజీ పాల్గొన్నారు.

**సారా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు**

రంగంపేట: సారా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈలకొలనులో మంగళవారం నవోదయం 2.0లో భాగంగా సారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా, గంజాయి ఆరోగ్యానికి హానికరమన్నారు. సారా, గంజాయి విక్రయించే వారిపై బైండోవర్ నమోదు చేస్తామన్నారు.దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సారా తయారీ, విక్రేతలకు నిలిచిపోతాయని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వినీషా, సీఐ సుధ, స్టేషన్ సిబ్బంది, సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

### విద్యార్థుల శ్రమదానం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని చెత్తను ఏరివేస్తున్న విద్యార్థులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణాన్ని విద్యార్థులు శ్రమదానంతో శుభ్రం చేశారు. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అభినందించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యతనివ్వాలని వీసీ ఈ సందర్భంగా సూచించారు.

### స్వర్ణాంధ్ర కృషి అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధుల సంక్షేమం, వృద్ధాశ్రమ నిర్వాహణలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ పనితీరు ప్రశంసనీయమని జిల్లా వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు యు.రాజు అన్నారు. మంగళవారం నగరంలో స్థానిక లాలాచెరువు వద్ద ఉన్న స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వృద్ధులతో ముచ్చటించి వారికి అందుతున్న సదుపాయాలు, సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర సేవలను నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, సహాయ సంచాలకులు రాజుకు వివరించారు. వృద్ధులకు, దివ్యాంగులకు కావలసిన ఉపకరణాల కోసం జిల్లా వృద్ధుల సంక్షేమ శాఖను సంప్రదించాలని రాజు తెలిపారు.

### బడ్జెట్‌పై సమీక్ష సమావేశం

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బుద్ధాల కన్నారావు అధ్యక్షతను నిర్వహించిన ఈ సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2025–26 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎంపీటీసీ సభ్యులందరూ సమీక్ష అనంతరం బడ్జెట్‌ను ఆమోదించారు. అధికారుల తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కొంకుదురు ఎంపీటీసీ పీవీ మాట్లాడుతూ తమ గ్రామంలోని రజక, యాదవ సంఘాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంకుదురు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### 150 మందికి వైద్య సేవలు



చినకొండేపూడి ఉచిత వైద్యశిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుధీర్

సీతానగరం: చినకొండేపూడిలో జెన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 150 మందికి వైద్య సేవలు అందించారు. మంగళవారం చినకొండేపూడిలో రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకర హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యులు సుధీర్ రోగులకు వైద్యసేవలు అందించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా మార్కెటింగ్ మేనేజర్ వై రాము, సీహెచ్ రుద్ర, కె బాబీ పాల్గొన్నారు.

### 'ఉద్యమ్' యాప్‌లో నేడు రిజిస్ట్రేషన్

రాజానగరం: పరిశ్రమల రిజిస్ట్రేషన్ల కోసం 'ఉద్యమ్' యాప్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని శ్రీవనిధర్ రామన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను 'ఉద్యమ్' యాప్‌లో పూర్తి చేసేందుకు ఆటోనగర్ (పాలచర్ల పంచాయతీ పరిధి) వద్ద బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామ సచివాలయాలలో ఇందుకు సంబంధించిన సర్వే ప్రారంభమైందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### నవోదయకు సాయి ధర్మతేజ ఎంపిక



రంగంపేట: సింగంపల్లికి చెందిన దేవిశెట్టి సాయి ధర్మతేజ నవోదయ ప్రవేశ పరీక్ష –2025లో విజయం సాధించి సీటు పొందాడు. సాయిధర్మతేజు స్థానిక శ్రీవిద్య పాఠశాలలో ఐదవ తరగతి చదివి నవోదయలో ఆరవ తరగతికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా సాయిధర్మతేజను మండల విద్యాశాఖాధికారులు కె. శ్రీనివాసరావు, పి. మధుసూదనరావు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

### మెరిట్ విద్యార్థులకు బహుమతులు

మధురపూడి: కోరుకొండ జూనియర్ కాలేజీలో చదువుతూ మెరిట్ సాధించిన విద్యార్థులు 11 మందికి మలబార్ గోల్డు వ్యాపార సంస్థ ప్రతినిధులు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. ఆర్జేడీ ఐ.శారద, ఆర్ఐఓ నరసింహారావు, డీవీఈఓ జేవీఎస్ సుబ్రహ్మణ్యం సమక్షంలో విద్యార్థులు ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున నగదు బహుమతులు మలబార్ గోల్డు చారిటబుల్ సంస్థ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్. రామచంద్రరావు, అధ్యాపకురాలు ఎస్.రమతి పాల్గొన్నారు.

### సారా సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన గోరుముచ్చు వీరాస్వామి సారా సరఫరా చేస్తుండగా అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై డి రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముగ్గళ్లలంకలో దావీదు, రమేష్ సారా తయారు చేసి, వీరాస్వామికి అందించారు. సారాను అమ్మకందారులకు సరఫరా చేయడానికి తీసుకుని వెళ్లుతుండగా ఎస్సై తన సిబ్బందితో కలసి దాడి చేసి వీరస్వామిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వీరాస్వామితోపాటుగా సారా తయారు చేస్తున్న దావీదు, రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరాస్వామిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వీరాస్వామిని తరలించామని ఎస్సై తెలిపారు.

### విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మధురపూడి: కోరుకొండ మండలం 33/11 కేవీ లైన్ నర్సాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిలిపివేస్తామని తెలిపారు. నర్సాపురం, గాదరాడ, కణుపూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.